క్లుప్తంగా

బస్ పాస్ కౌంటర్లకు రెండు రోజుల సెలవు

ఉక్కునగరం: ఆర్టీసీ బస్ పాస్ కౌంటర్లు రెండు రోజులు పని చేయవని కూర్మన్నపాలెం స్టీల్ సిటీ డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. బస్‌పాస్ అప్లికేషన్ ఆధునికీకరిస్తున్న కారణంగా 12, 13 తేదీల్లో కౌంటర్లు పని చేయబోవన్నారు. ఈనెల 14 నుంచి బస్‌పాస్ కౌంటర్లు యధావిధిగా పనిచేస్తాయని, వినియోగదారులు గమనించాలని కోరారు.

కరెంట్ కోతలు ఆపండి



ఏఈకి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కూర్మన్నపాలెం: తరచూ కరెంటు కోతలు, లోవోల్టేజీ సమస్యలకు పరిష్కారం చూపాలని 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు వడ్లపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ వీర్రాజును కలసి ఆ పార్టీ నాయకులు ఇల్లపు రాము, పి.వేణు, డి.దానప్పలు వినతిపత్రం సమర్పించారు. వార్డులోని వివిధ ప్రాంతాల్లో తరచూ విద్యుత్ కోతలతో పాటు లోవోల్టేజీ సమస్య తలెత్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని నాయకులు ఏఈ కి వివరించారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.గోవిందరాజులు,శంకర్రావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణవేణి



ప్రిన్సిపాల్ కృష్ణవేణిని సత్కరిస్తున్న ప్రజాసంఘాల నేతలు

అగనంపూడి: అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా సీమల కృష్ణవేణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కృష్ణవేణి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా ఇక్కడ పనిచేసిన సుధాకర్‌బాబు కె.కోటపాడు జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణవేణిని అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ ఇన్‌చార్జి రామకోటి, లయన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ కిడిమి హనుమంతురావు, స్థానిక నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, గొల్లవిల్లి కనక భవాని తదితరులు అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే పల్లాకు నివాళి

పెదగంట్యాడ: కార్మిక నేతగా, మాజీ ఎమ్మెల్యేగా పల్లా సింహాచలం సేవలు మరువలేమని ఉక్కు నిర్వాసిత సంఘం కన్వీనర్ గొందేశి సత్యారావు అన్నారు. ఉక్కు నిర్వాసితుల సంఘం, అఖిలపక్ష రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో పెదగంట్యాడ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో బుధవారం పల్లా సింహాచలం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యెల్లేటి శ్రీనివాసరావు, మంత్రి శంకరనారాయణ, నమ్మి అప్పారావు, నమ్మి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఇసుకకొండకు భక్తులు పోటెత్తారు



సామూహిక వ్రతంలో పాల్గొన్న దంపతులు

దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. వేకువజాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పాలనకు ఏడాది..

అభివృద్ధి జాడేది?



పాతగాజువాకలో ధర్నా నిర్వహిస్తున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు (ఫైల్)

కూటమి ప్రభుత్వం ఏర్పడి సరిగ్గా ఏడాది పూర్తయింది. ఎన్నికలకు ముందు నోటికి వచ్చిన హామీలన్నీ ఇచ్చి ప్రజలను ఏమార్చిన కూటమి.. అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీలను విస్మరిస్తోంది. సూపర్ సిక్స్ అంటూ ఎడాపెడా హామీలను ప్రకటించిన కూటమి వాటిని అమలు చేయకపోగా.., కనీసం స్థానిక సమస్యల పరిష్కారం వైపు కన్నెత్తి చూడకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. గాజువాక నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను పరికిస్తే... – గాజువాక

- కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి
- నిర్వాసితులకు కానరాని ఉపాధి
- కొండెక్కిన కొండవాలు అభివృద్ధి

ఏపీఐఐసీ నిర్వాసితుల గోడు పట్టలేదు




వడ్లపూడిలో పరిశ్రమలకు కేటాయించిన భూములు

గాజువాక నియోజకవర్గంలోని తుంగ్లాం, ఫకీర్ తక్యా, యాదవజగ్గరాజుపేట, వడ్లపూడి గ్రామాలకు చెందిన రైతుల నుంచి ఏపీఐఐసీ అధికారులు వ్యవసాయ భూములు సేకరించారు. పారిశ్రామిక అవసరాల పేరుతో 1966 నుంచి 82 వరకు దశలవారీగా 796 ఎకరాలు తీసుకున్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలతో పాటు ఆ భూముల్లో ఏర్పాటు చేసే పరిశ్రమల్లో 60 శాతం ఉద్యోగాలు ఇస్తామని భూ సేకరణ సమయంలో హామీ ఇచ్చారు. దీనిపై ఎంవోయూ కాగితాల్లో మూలగడం తప్ప ఎక్కడా అమలుకు నోచుకోలేదు. 2014లో ఎమ్మెల్యేగా గెలుపొందిన పల్లా శ్రీనివాసరావు సమస్యను పరిష్కరించి నిర్వాసితులందరికీ స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చి నప్పటికీ అమలు కాలేదు. మళ్లీ 2024లోనూ అదే హామీ ఇచ్చారు. ఏడాది పూర్తయినా పరిష్కారం మాత్రం ముందుకు కదల్లేదు.

తమకు అధికారం ఇస్తే విశాఖ ఉక్కు నిర్వాసిత కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలకు గ్యారంటీ ఉంటుందని అభయమిచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు మాట మార్చారు. ప్రభుత్వ సంస్థగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కనీసం ముందస్తు నోటీసు లేకుండా 3,214 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించింది. అందులో దాదాపు 70 శాతం మంది ఉక్కు నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులే ఉన్నారు. దీన్ని లేబర్ కమిషనర్ ఖండిస్తున్నా వెనక్కి తగ్గలేదు. వారికి వెన్నుదన్నుగా నిలవాల్సిన స్థానిక ఎమ్మెల్యే నిర్వాసితులంటే ఏంటో కొత్త బాష్యం చెబుతున్నారు. కేవలం ఆర్‌కార్డు ఉండి ఉద్యోగం కోల్పోతేనే తన బాధ్యత అంటూ ఇటీవల పేర్కొనడం అందర్నీ విస్మయానికి గురి చేసింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి తమ భూములు, ఇళ్లు కోల్పోయినవారి వారసులు ఇప్పుడు కాంట్రాక్టు కార్మికులుగా జీవనం సాగిస్తున్నవారి విషయం తనకు పట్టదని చెప్పడం చర్చనీయాంశమైంది.

కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి



పోర్టు రోడ్‌లో నిండిపోయిన కాలుష్యం

గాజువాకలోని వివిధ ప్రాంతాల ప్రజలు కాలుష్యంతో హడలిపోతున్నారు. జాతీయ రహదారితో పాటు పట్టణంలోని పలు ప్రధాన రహదారులు ధూళి, దుమ్ముతో నిండిపోతుండడంతో ద్విచక్ర వాహనదారులు కళ్లు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ దుమ్ము వివిధ కాలనీల్లోని నివాసాలపై దాడి చేస్తోంది. నిబంధనలు పాటించకుండా లారీల్లో రవాణా చేస్తున్న ఇసుక, మట్టి, కాంక్రీట్ మిక్సింగ్ మెటీరియల్, కెమికల్ పౌడర్లు రోడ్లపై పడిపోవడంతో జనం తిరగలేని పరిస్థితి ఏర్పడుతోంది. దుమ్ము వల్ల కళ్ల మంటలు, కళ్ల నొప్పులు, శ్వాసకోస సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. కాలుష్య సమస్యను పరిష్కరించాలని జనం కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

అతీగతీలేని ఫిష్ ల్యాండింగ్ సెంటర్



యారాడ తీరంలో నిర్మాణం నిలిచిపోయిన జెట్టీ

గంగవరం మత్స్యకారుల కోసం యారాడ తీరంలో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం అతీగతీలేకుండా పోయింది. ఈ నిర్మాణం జరిగితే గంగవరం ప్రాంతంలోని మత్స్యకారులందరికీ ఉపయోగపడతుంది. సముద్రవేటకు వెళ్లి వచ్చిన మత్స్యకారులు తాము తీసుకొచ్చిన మత్స్య సంపదను ఇందులో భద్రపరుచుకోవడానికి ఉపయోగపడుతుంది. 2014లో జరిగిన ఎన్నికల సందర్భంగా దీన్ని నిర్మించి తీరుతామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆ హామీని నెరవేర్చలేదు. కాలుష్యానికి దూరంగా గంగవరం గ్రామాన్ని తరలిస్తామన్న హామీ కూడా నెరవేరలేదు. అయితే, 2024లో ఎమ్మెల్యే అయిన తర్వాత నిర్వహించిన వందరోజుల ఉత్సవాల సందర్భంగా ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మిస్తామని మాత్రం హామీ ఇచ్చారని, ఆ విషయం మాట్లాడటానికి దగ్గరకు వెళ్తున్నా అపాయింట్‌మెంట్ దొరకడం లేదని మత్స్యకార సంఘం పెద్దలు వాపోతున్నారు. ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ నిర్మించేవరకు తమకు జీవన భృతి ఇస్తామని చెప్పినప్పటికీ అమలు కావడం లేదని పేర్కొంటున్నారు.

కొండెక్కిన రక్షణ గోడల ప్రతిపాదనలు

కొండవాలు ప్రాంతాల ప్రజలు రక్షణ గోడలు లేక బితుకుబితుకు మంటూ జీవనం సాగిస్తున్నారు. వర్షం వస్తే ఎప్పుడు ఏ గోడ కూలుతుందో.. ఎక్కడ కొండచరియ విరిగి పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కొండవాలు ప్రాంతాల్లోని పలుచోట్ల రిటైనింగ్ వాల్స్ (రక్షణ గోడల)ను నిర్మించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆమోదించిన టెండర్లను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. ఈ ప్రభుత్వంలోనే సుమారు ఐదు నెలల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమోదించిన రిటైనింగ్ వాల్స్ నిర్మాణ పనుల ప్రగతి టెండర్ల దశకు వెళ్లకపోవడం పాలకుల నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది. గాజువాక పట్నంలోని ఆరు వార్డుల పరిధిలో 12 కొండవాలు కాలనీలున్నాయి. 20వేల కుటుంబాలకు పైగా స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాయి. 65వ వార్డు భానోజీతోట, 70వ వార్డు ఎల్‌బీఎస్‌నగర్, దశమికొండ, 71వ వార్డు శ్రీనగర్, సుందరయ్యకాలనీ, 73వ వార్డు సింహగిరి కాలనీ, 74వ వార్డు దయాళ్‌నగర్, పైడిమాంబ కాలనీ, 67వ వార్డు పెంటయ్యనగర్, కృష్ణానగర్, గణేష్‌నగర్, బొజ్జన్నకొండ కాలనీలున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసినప్పుడల్లా కొండలు నానిపోయి నివాసాలు కూలిపోతున్నాయి. ఏ కొండపై ప్రమాదం చోటు చేసుకున్నా ఈ కాలనీల్లో నివాసులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది.

కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలి



ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, కారణాలు చెప్పకుండా కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించడం దారుణం. ఈ ఉద్యోగంపైనే ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నవారు యాజమాన్యం చేపట్టిన దుశ్చర్యలకు రోడ్డున పడ్డారు. కనీసం ప్రజాప్రతినిధులైనా పట్టించుకుని వారిని విధుల్లోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలిఅ.

– నమ్మి రమణ, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుడు

మత్స్యకారులను పట్టించుకోండి



గంగవరం మత్స్యకారులకు దశాబ్దం తరబడి న్యాయం జరగడం లేదు. ఎన్నికలకు ముందు మాకు హామీలు ఇస్తున్నారు. గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదు. గంగవరం పోర్టువల్ల మాకు ఉపాధి పోయింది. కనీసం ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ కడితే కొంతైనా ఉపాధి దొరుకుతుంది. ప్రజాప్రతినిధులు ఆలోచించి న్యాయం చేయాలి.

– కొవిరి కృష్ణ, మత్స్యకార నాయకుడు

వర్షాలు పడితే ఆందోళన



కొండవాలు ప్రాంతంలో ఉంటున్న మేము వర్షాలు కురిసినప్పుడల్లా భయంతో బతకాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా వార్డులో రెండు రిటైనింగ్ వాల్స్ కట్టారు. మిగిలినవి కూడా కడతారనే సమయానికి ఎన్నికలు రావడంతో ఆగిపోయాయి. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. మంజూరైన పనులను కూడా రద్దు చేశారు. ఇప్పటికైనా ఆలోచించి రిటైనింగ్ వాల్స్ వెంటనే నిర్మించాలి.

– నావాన రమేష్, చిట్టినాయుడు కాలనీ

యోగాతో గుర్తింపు



యోగ సాధన చేస్తున్న అగనంపూడి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

అగనంపూడి: యోగా ప్రాధాన్యతను నలుదిశలా వ్యాపించేలా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని బ్రహ్మకుమారీస్ అగనంపూడి (దివ్యజ్యోతి భవనం) ఇన్‌చార్జి బీకే రామకోటి అన్నారు. అగనంపూడి ప్రభుత్వ జూనియర్‌కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు బుధవారం ఉచిత యోగ శిక్షణ కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పుట్టిన యోగాకు ప్రపంచ దేశాల్లో ప్రాధాన్యం సంతరించుకొనేలా చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ యోగ సాధన మంచి ఆరోగ్యానికి అవసరమన్నారు. విద్యార్థులు ప్రతీరోజూ యోగ సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిళ్లను అధిగమించి ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు దివ్య, శ్రీదేవి, సూర్య ప్రదీప్ పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ నాగేంద్రకు అభినందనలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభకనపర్చి షైనింగ్‌స్టార్ పురస్కారం దక్కించుకున్న జె.హేమంత్‌ను కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, తదితరులు అభినందించారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవంలో శ్రీదేవి భూదేవి సహిత తిరుమలేశుడు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువైన వేంకటేశ్వరునికి బుధవారం జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తిరుమాఢ వీధుల్లో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుడిని ఊరేగించారు. ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



హెచ్‌ఆర్ విభాగాధిపతి మధుసూదనరావును సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగాధిపతి ఎం. మధుసూదనరావు అన్నారు. ఉక్కు పరిపాలన భవనంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను వివరించారు. వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ యాజమాన్యం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్లాంట్ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లైజన్ ఆఫీసర్లు నల్లి సుందరం, బాబూనాయక్, అసోసియేషన్ అధ్యక్షులు బి. తొడన్న, ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎస్. మోహన్‌బాబు, ఎల్.వి. రమణ, సాయి ప్రసాద్, అప్పారావు, గణేష్, తిమోతి బాబు తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో మహిళ మృతి



సంఘటన జరిగిన ఇండస్ట్రీ ఎదుట గుమిగూడిన గ్రామస్తులు



జోగురత్నం (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: స్క్రాప్ దుకాణంలో పని చేస్తూ మహిళ హఠాత్తుగా మరణించిన సంఘటన మిందీ రోడ్డు రాంనగర్‌లోని ఏ – బ్లాక్ ఆటోనగర్‌లో చోటు చేసుకుంది. ఘటనపై గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివీ.. మిందిలో చినకుమ్మరి వీధిలో నివాసం ఉంటున్న దేవరపు జోగురత్నం (47) ఆరేళ్లుగా రాంనగర్‌లోని సుప్రీంఇండస్ట్రీస్ (ఐరన్, స్టీల్ స్క్రాప్, ప్లాస్టిక్ స్క్రాప్)లో ప్లాస్టిక్ ప్రాసెసింగ్ వంటి పనులు చేస్తుంది. బుధవారం యధావిధిగా పనులు చేసుకుంటున్న ఆమె హఠాత్తుగా చనిపోయిందని తోటి కార్మికులు, యజమాని తెలిపారు. విషయం తెలుసుకున్న గాజువాక పోలీసులు ఇండస్ట్రీకి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా మృతురాలికి నష్టపరిహారం ఇవ్వాలని ఆమె బంధువులు, గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. కొంత నష్టపరిహారం చెల్లించడానికి యజమాని ఎం.డి.షఫీ అంగీకరించారని గ్రామ నాయకులు తెలిపారు. మృతురాలికి భర్త దేవరపు జోగారావు, కుమార్తెలు డి.కుమారి (32), డి.సాయి జ్యోతి (20) ఉన్నారు.

సంపత్ వినాయగర్ ఆలయానికి రూ.లక్ష విరాళం



చెక్కు రూపంలో విరాళం అందజేస్తున్న మధుసూదన్ ప్రభుత్వ అండ్ సావిత్రి కుటుంబ సభ్యుడు

దాబాగార్డెన్స్ : సంపత్ వినాయగర్ ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన మధుసూదన్ ప్రభు, సావిత్రి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దేవస్థాన సహాయ కమిషనర్, ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావుకు బుధవారం ఆ చెక్కును అందజేశారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



తల్లులకు అవగాహన కల్పిస్తున్న జ్యోతిశ్రీ

కూర్మన్నపాలెం: రక్తహీనతను అరికట్టడానికి తగిన పౌష్టిక ఆహారం తీసుకోవాలని సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జ్యోతిశ్రీ పేర్కొన్నారు. 87వ వార్డు అప్పికొండ కాలనీలో బుధవారం మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆకు కూరలు, రాగి జావ వంటివి తినడం ద్వారా పిల్లల తల్లులు రక్తహీనతకు గురికాకుండా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ రాగిపిండితో తయారు చేసే పదార్థాలు తినాలని ఆమె కోరారు. రాంగిపిండితో లడ్డూలు తయారు చేసే విధానాన్ని వివరించారు. అనంతరం తక్కువ ఖర్చుతో చేసిన తిను బండారాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దివ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి


గాజువాక: విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి నైతిక విలువలు ఉపయోగపడతాయని రాజయోగ శిక్షణ నిపుణురాలు శ్రీహరిత అన్నారు. స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో ఉపాధ్యాయులతో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రసంగించారు. విద్యార్థులకు యోగా, ధ్యానం, సేవా, కృషి, జ్ఞానం అనే మార్గాలు అలవడేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ధ్యానం ద్వారా ఒత్తిడి, భావోద్వేగాలను అధిగమించవచ్చని, తద్వారా ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీ రాజయోగిని సోమేశ్వరి, పాఠశాల చైర్మన్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ జయశ్రీ శర్మ, టీబీకే కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

అంధకారంలో పెదగంట్యాడ

ప్రధాన మార్గాల్లో వెలగని వీధి లైట్లు



బాలచెరువు ప్రధాన రహదారిలో చిమ్మ చీకటి..



సిద్ధేశ్వరం రోడ్డులో..

పెదగంట్యాడ: చీకటి పడితే ఆ మార్గాల్లో ప్రయాణం కష్టతరంగా మారుతోంది. సాయంత్రం అయితే వీధి వెలగకపోవడంతో చీకట్లు కమ్ముకుంటున్నాయి. బాలచెరువు, నడుపూరు ఎస్సీ కాలనీ, సిద్ధేశ్వరం, సీతానగరం, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, మదీనాబాగ్ తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రి అయితే అంధకారం నెలకొంటుంది. రోడ్లు దాటే సమయంలో ఆయా ప్రదేశాల్లో నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటుంది. స్పీడ్ బ్రేకర్లు కనిపించక పోవడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.సిద్ధేశ్వరం రోడ్డులో లైట్లు ఎప్పుడు వెలుగుతాయో.. ఎప్పుడు వెలగవో తెలియదు. గతంలో వీధి లైట్లు వెలగకపోతే పోల్ నెంబర్‌తో పాటు ఫిర్యాదు చేస్తే వెంటనే కొత్తవి అమర్చేవారు. ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే పరిష్కరించేవారు. కానీ ఏడాది నుంచి వీధిలైట్ల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉందని స్థానికులు వాపోతున్నారు.

కిక్ బాక్సింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ లక్ష్మణ్ తదితరులు

గాజువాక: విశాఖ నగరంలో ఈనెల 28 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఓపెన్ కిక్‌బాక్సింగ్ పోటీల పోస్టర్‌ను బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యే పెద్ద వెంట్‌ను తలపెట్టడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన వారు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, రాష్ట్ర కిక్‌బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు టెంకి దుర్గ, ప్రతినిధులు దామోదర్, కిరణ్ కుమార్, దేవు, రాజు, స్థానిక నాయకులు ఎల్లాజీరావు, నాగేశ్వరరావు, రంగనాయకులు పాల్గొన్నారు.